సాక్షి
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



జగనన్న పాలనలో పండుగలా..

సీఎం వైఎస్ జగన్ పాలనలో వ్యవసాయం పండుగని ఎమ్మెల్యే ఉదయభాను అన్నారు. అనిగండ్లపాడులో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ▸II లో



ముఖ్యమంత్రి పర్యటనపై ట్రయల్ రన్

దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ సన్నిధికి సీఎం వైఎస్ జగన్ శుక్రవారం రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు గురువారం ఆలయంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ▸II లో



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 525.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 847.40 అడుగుల వద్ద ఉంది.

న్యూస్‌రీల్

భక్తులకు కోరినన్ని లడ్డూలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు ఎన్ని లడ్డూలను కోరితే అన్ని ఇవ్వాలని ఆలయ అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. బ్రాహ్మణ వీధి లోని లడ్డూ తయారీ పోటు, కనకదుర్గనగర్‌లో లడ్డూ తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. లడ్డూ తయారీ, నాణ్యతపై ఆరా తీసిన కలెక్టర్, ఇప్పటి వరకు ఎన్ని లడ్డూలు నిల్వ ఉన్నాయని ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూలా నక్షత్రానికి మూడు లక్షలకు పైగా లడ్డూలను భక్తులకు అందుబాటులో ఉంచామని ఆలయ ఏఈఓ ఎన్.రమేష్‌బాబు తెలిపారు. ఇప్పటి వరకు రోజుకు 60 వేల నుంచి 70 వేల వరకు లడ్డూలను విక్రయించామన్నారు. శుక్రవారం భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అవసరమైతే మరిన్ని లడ్డూలను సిద్ధం చేసేలా సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. కనకదుర్గ నగర్, రైల్వే స్టేషన్, బస్టాండ్, భవానీఘాట్ల వద్ద ప్రసాద విక్రయ కేంద్రాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆలయ అధికారులు లక్ష్మణస్వామి, ఎం.ఎస్.ఆర్.కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్య భక్తుల భద్రతకు ప్రాధాన్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారిని రెండు లక్షల నుంచి మూడు లక్షల మంది దర్శించుకునే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా తెలిపారు. ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఫ్లై ఓవర్ దిగువ నుంచి వాహనాలను అనుమతించబోమని స్పష్టంచేశారు. సీతమ్మ వారి పాదాలు, మోడల్ గెస్ట్ హౌస్, కుమ్మరి పాలెం, వినాయకుడి గుడి వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీఐపీ, ప్రొటోకాల్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో నియమించిన సిబ్బందితో పాటు అదనంగా మరో 800 మందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సామాన్య భక్తుల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించాలని కోరారు.

దుర్గమ్మ భక్తుల సేవలో నాగార్జున సిమెంట్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి విచ్చేసే వృద్ధులు, దివ్యాంగులను కొండపైకి చేర్చేందుకు నాగార్జున సిమెంట్ మూడు ఉచిత బస్సులను ఏర్పాటు చేసింది. ఈ బస్సులు తొమ్మిది రోజుల పాటు భక్తుల సేవకు ఉపయోగించేందుకు రూ.3.24 లక్షలు చెల్లించేందుకు నాగార్జున సిమెంట్ (ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్) ముందుకొచ్చింది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రూపా భూపతిరాజు, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ శ్యాంప్రకాష్ ఈ మొత్తాన్ని చెల్లించేందుకు అంగీకారం తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ అధికారులకు కంపెనీ ప్రతినిధులు ఎంజీఎం సుబ్బారావు, ప్రసాద రావు గురువారం అందజేశారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు కాని విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించే గడువును నవంబర్ 30వ తేదీ వరకూ పొడిగించామని ఇంటర్మీడియెట్ బోర్డు ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రాంతీయ అధికారి పెదపూడి రవి కుమార్ గురువారం తెలిపారు. మార్చి 2023 ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులుకాని జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు, డ్రాపవుట్స్ జ్ఞాన భూమి పోర్టల్ ద్వారా ఫీజు చెల్లించాలని సూచించారు. నిర్ణీత ఫీజు చెల్లించి అన్ని పరీక్షలకు హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దానిని పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. కంపార్ట్‌మెంటల్ అని కాకుండా ఒకే సారి ఉత్తీర్ణులయ్యారని సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. ఉత్తీర్ణులు కాని విద్యార్థులు తిరిగి అడ్మిషన్ తీసుకుంటే జగనన్న అమ్మ ఒడి పథకానికి అర్హులవుతారని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకూ జూనియర్ కళాశాలలకు దసరా సెలవులు ప్రకటించారని తెలిపారు. కళాశాలల్లో ఎటువంటి తరగతులూ నిర్వహించొద్దని ఆదేశించారు.

ఇంద్రకీలాద్రి భక్తజనుల శరణుఘోషతో మారుమోగుతోంది. శ్రీ దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కనకదుర్గమ్మ గురువారం శ్రీ మహా చండీదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. అనేక మంది దేవతలు కొలువైన శ్రీచండీ అమ్మవారిని పూజిస్తే సర్వదేవతలను ప్రార్థించినట్లే. చండీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన జగన్మాతను దర్శించుకునేందుకు 70 వేల మందికిపైగా భక్తులు తరలివచ్చారు.



కనుల పండువ: వైభవంగా సాగుతున్న ఆదిదంపతుల నగరోత్సవం



అలంకారం : శ్రీమహా చండీదేవిగా కనకదుర్గమ్మ

మహాచండీ నమోస్తుతే

- దసరా ఉత్సవాల్లో తొలిసారి మహాచండీదేవి అలంకరణ
- దుర్గమ్మ దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తజనులు
- ప్రత్యేక ఆర్జిత సేవల్లో పాల్గొన్న ప్రముఖులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో తొలి సారిగా కనకదుర్గమ్మ అమ్మవారిని గురువారం మహాచండీదేవిగా అలంకరించారు. జగన్మాతను మహాచండీదేవిగా దర్శించుకునేందుకు అశేష భక్తజనం ఇంద్రకీలాద్రికి తరలి వచ్చింది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే అమ్మ వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మ వారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. గురువారం ఒక్క రోజే 70 వేల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు.





కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) మెహరీన్



గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో మూలా నక్షత్రం దర్శనం కోసం వేచివున్న భక్తులు

భారీగా తరలివచ్చిన భక్తులు

అధిక శ్రావణం, తిథుల హెచ్చుతగ్గుల నేపథ్యంతో పాటు ఇంద్రకీలాద్రిపై నిత్యం చండీహోమం నిర్వహిస్తున్నందున అమ్మవారిని ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో మహాచండీదేవిగా అలంకరించామని ఆలయ వైదిక కమిటీ సభ్యులు మురళీధర్‌శర్మ, కోట ప్రసాద్ తెలిపారు. దుర్గమ్మకు తొలి సారిగా చేసిన మహాచండీదేవి అలంకరణను చూసి తరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. తెల్లవారుజాము నాలుగు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని క్యూలైన్లలో ఏకరీతిన రద్దీ కనిపించింది. సాధారణ భక్తులు, భవానీలతో పాటు పుర ప్రముఖులు, అధికారులు అమ్మవారి దర్శనానికి బారులుతీరారు. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్లలో భక్తుల రద్దీ కనిపించింది. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది.

ద్వారకాతిరుమల నుంచి పట్టువస్త్రాలు

దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మకు ద్వారకా తిరుమల దేవస్థానం నుంచి గురువారం పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చిన్న తిరుపతి, ద్వారకా తిరుమల ఈఓ త్రినాథ్, ఇతర అధికారులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులు వారికి సాదర స్వాగతం పలికారు. అనంతరం ద్వారకా తిరుమల అధికారులు అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలను అందజేశారు. ద్వారకా తిరుమల ఈఓ త్రినాథ్‌కు దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్. రామారావు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

ఆర్జిత సేవల్లో పలువురు ఐఏఎస్‌లు

కనక దుర్గమ్మను పలువురు ఐఏఎస్ అధికారులు దర్శించుకున్నారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్ వాణీమోహన్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్య కుమారి, ఐఆర్ఎస్ అధికారి కోటేశ్వరమ్మ దర్శించుకున్నారు. మహా చండీదేవికి నిర్వహించిన ప్రత్యేక కుంకుమార్చనలో వాణీమోహన్, కోటేశ్వరమ్మ, సూర్య కుమారి పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వారికి వేద పండితుల ఆశీర్వచనం, ఆలయ చైర్మన్ రాంబాబు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అమ్మవారిని సినీనటి మెహరీన్ దర్శించుకున్నారు.



ఆదిదంపతుల నగరోత్సవం.. నయనానందకరం

దసరా ఉత్సవ వేళ ఆదిదంపతుల నగరోత్సవం గురువారం సాయంత్రం నయనానందకరంగా సాగింది. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై కొలువుదీరగా, ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తజనుల కోలాటం, గరగ నృత్యాలు, కేరళ వాయిద్యాల నడుమ నగరోత్సవం సాగింది. మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాల నుంచి ఊరేగింపు ప్రారంభమై మహా మండపం, గోశాల, కనకదుర్గ నగర్, టోల్‌గేట్ మీదుగా తిరిగి అమ్మవారి ఆలయానికి చేరింది. ఆలయ చైర్మన్ రాంబాబు, ఈఓ కె.ఎస్. రామారావు పాల్గొన్నారు. అనంతరం మహామండపం ఎదుట ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆది దంపతులకు జరిగిన నగరోత్సవంతో పాటు పూజా కార్యక్రమాల్లో భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.



దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భవానీమాలధారులు



ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ రాంబాబు

నేటి అలంకారం శ్రీ సరస్వతీదేవి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో అమ్మవారు శుక్రవారం శ్రీ సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మూలా నక్షత్రం అమ్మ వారి జన్మనక్షత్రం. మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతిగా శక్తి స్వరూపాలలో దుష్ట సంహారం చేసిన శ్రీ దుర్గాదేవికి శరన్నవ రాత్రి ఉత్సవాల్లో మూలా నక్షత్రం రోజున వాగ్దేవతామూర్తి అయిన సరస్వతి అవతారంలో భక్తులను అనుగ్రహిస్తారు. సరస్వతీ దేవిని సేవించడం వల్ల విద్యార్థినీ విద్యార్థులు సర్వ విద్యల్లో విజయం పొందుతారు. భక్తులు మూలా నక్షత్రం నుంచి విజయ దశమి వరకు విశేష పుణ్యదినాలుగా భావించి దుర్గమ్మను ఆరాధిస్తారు. భక్తజనుల అజ్ఞానాన్ని పారదోలి జ్ఞానజ్యోతిని వెలిగించే జ్ఞానప్రదాయిని శ్రీ సరస్వతీదేవి. శ్రీ సరస్వతీదేవి దర్శనం అఖిల విద్యాభ్యుదయ ప్రదాయకం.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజాము రెండు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- తెల్లవారుజాము ఐదు గంటలకు ఖడ్గమాలార్చన
- ఉదయం ఏడు, పది గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం ఎనిమిది గంటలకు ప్రత్యేక శ్రీచక్ర నవార్చన
- ఉదయం ఎనిమిది గంటలకు ప్రత్యేక చండీ హోమం
- మధ్యాహ్నం మూడు గంటలకు అమ్మ వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాల సమర్పణ
- సాయంత్రం ఆరు గంటలకు ఆది దంపతులకు నగరోత్సవ సేవ
- సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు మహా నివేదన, పంచహారతులు, వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

వృత్తికి జగనన్న చేదోడు

- జగనన్న చేదోడు నాలుగో విడత నిధులు విడుదల
- ఎన్టీఆర్ జిల్లాలో 15,176 మందికి రూ.15.18 కోట్ల లబ్ధి
- లబ్ధిదారులకు చెక్కు అందజేసిన కలెక్టర్ ఢిల్లీరావు



లబ్ధిదారులకు ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చేతి వృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు జగనన్న చేదోడు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. క్రమం తప్పకుండా వరుసగా నాలుగో ఏడాది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ఆర్థిక సాయం సొమ్మును జమ చేసిందని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గురువారం జగనన్న చేదోడు పథకం ద్వారా నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్ల కుటుంబాల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రాష్ట్ర వ్యాప్తంగా 3,25,020 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ.325.02 కోట్ల ఆర్థిక సాయాన్ని జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి లబ్ధిదారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లాలో జగనన్న చేదోడు పథకంలో భాగంగా 15,176 మంది లబ్ధిదారులకు రూ.15.18 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించిందని తెలిపారు. 10,926 మంది టైలర్లకు రూ.10.93 కోట్లు, 2,979 మంది రజకులకు రూ.2.98 కోట్లు, 1,271 మంది నాయీబ్రాహ్మణులకు రూ.1.27 కోట్ల చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిందని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతోందన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితా ప్రదర్శించి, సోషల్ ఆడిట్ నిర్వహించిన అనంతరమే వారికి ఆర్థిక సాయం అందిస్తున్నామని స్పష్టంచేశారు. ప్రభుత్వం చేస్తున్న సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వమూ చేతి వృత్తులపై ఆధారపడి జీవించే వారి బాగోగులను పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న చేదోడు పథకాన్ని ప్రవేశపెట్టి క్రమం తప్పకుండా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు శ్రీకాంత్, శివరామ కృష్ణ, గౌస్ మొహిద్దీన్, కూరపాటి గీతాంజలీదేవి, బండి పుణ్యశీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ, బీసీ కార్పొరేషన్ ఏఈ రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారులకు ఆర్థిక భరోసా



జగనన్న చేదోడు పథకం ద్వారా వచ్చిన ఆర్థిక సాయంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నాను. మా కుటుంబంలో సీఎం జగన్ ప్రవేశపెట్టిన అమ్మఒడితో పాటు మరెన్నో పథకాల ద్వారా లబ్ధిపొందాను. మాలాంటి వృత్తిదారులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. అందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– షేక్ సల్మా, లబ్ధిదారు

పెట్టుబడికి ఆసరా



నేను బార్బర్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇప్పటి వరకు మూడు విడతలుగా జగనన్న చేదోడు పథకం ద్వారా లబ్ధి పొందాను. వచ్చిన ఆర్థిక సాయంతో షాపులో కావాల్సిన సామాన్లను కొనుగోలు చేసుకున్నా. ఎందరో నాయీబ్రాహ్మణులకు పెట్టుబడి కోసం అప్పులు చేయకుండా ఈ పథకం ద్వారా ఆర్థిక చేయూత లభించింది.

– కొడాలి సీతారామరాజు, లబ్ధిదారు

ప్రకృతి వ్యవసాయం భేష్



ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలుసుకుంటున్న గుజరాత్ వ్యవసాయ సీనియర్ డెలిగేషన్ టీమ్

మైలవరం: మండలంలోని పుల్లూరు యూనిట్ పరిధిలో పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను గుజరాత్ రాష్ట్ర అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రటరీ పియూష్ పల్సానా మెచ్చుకున్నారు. పుల్లూరు యూనిట్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ గ్రామమైన చంద్రగూడెంలో రైతులు కోటేశ్వరరావు, కృష్ణమూర్తి సాగుచేస్తున్న పాలివెజిటబుల్స్ మోడల్ పొలాలు, దాసుళ్లపాలెంలోని రామిరెడ్డికి చెందిన ఐదు లేయర్ల వ్యవసాయ క్షేత్రాన్ని గుజరాత్ ప్రకృతి వ్యవసాయ సీనియర్ డెలిగేషన్ టీమ్ సభ్యులు గురువారం సందర్శించారు. రైతులు పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయం మధ్య తేడాలపై ఆరాతీశారు. మహిళా సంఘాల్లో సభ్యులైన చిన్న, సన్నకారు రైతులు గ్రామ సంఘాల ద్వారా వచ్చే రుణాలను ప్రకృతి వ్యవసాయానికి ఏ విధంగా వినియోగిస్తున్నారు, సేంద్రియ ఎరువు తయారీ విధానం గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం భేషుగ్గా ఉందని ప్రశంసించారు. పియూష్ పల్సానాతో పాటు ఆత్మ రిటైర్డ్ ఓఎస్డీ దినేష్ పటేల్, ఆత్మ డైరెక్టర్ ప్రకాష్ రబారి, ఆత్మ డీడీఏ పర్బత్ కిష్టారియా, ఎన్టీఆర్ జిల్లా ప్రకృతి వ్యవసాయ రీజినల్ కోఆర్డినేటర్ ప్రకాశ్, జిల్లా వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ జన్ని శాంతి కుమారి, ఎన్ఎఫ్ఏలు, యూనిట్ లెవెల్ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ముగిసిన సాఫ్ట్ టెన్నిస్ జూనియర్ చాంపియన్‌షిప్



హోరాహోరీగా జరుగుతున్న మ్యాచ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్థానిక ఇందిరా గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఐదు రోజులపాటు జరిగిన 18వ జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో 23 రాష్ట్రాల నుంచి సుమారు 600 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. అన్ని విభాగాల్లోనూ తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ క్రీడాకారులు విశేష ప్రతిభ చాటారు. ముగింపు కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా క్రీడాప్రాధికారసంస్థ (డీఎస్ఏ) చీఫ్ కోచ్ ఎస్ఏ అజీజ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనతి కాలంలోనే దేశంలో సాఫ్ట్ టెన్నిస్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ కృషి ఫలితంగా విజయవాడకు చెందిన ఎస్.అనూష ఇటీవల చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో సాఫ్ట్ టెన్నిస్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిందన్నారు. జాతీయ స్థాయి జూనియర్ చాంపియన్‌షిప్‌లోనూ నగర క్రీడాకారిణి ఎం.భావన అత్యుత్తమ ప్రతిభను కనబరిచి కాంస్య పతకాన్ని సాధించిందని తెలిపారు. ప్రభుత్వం కూడా క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు పురస్కారాలు ప్రదానం చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో సాఫ్ట్ టెన్నిస్ ఫెడరేషన్ కోశాధికారి విజయ్ సోలంకి, రాష్ట్ర సంఘం చైర్మన్ దారం నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి డి.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్డీవోలు బదిలీ




బందరు ఆర్డీవో మొవిడి వాణి ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లాలో ఆర్డీవోలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్‌ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం ఆర్డీవోగా పనిచేస్తున్న ఐ. కిశోర్‌ను కాకినాడ ఆర్డీవోగా బదిలీ చేశారు. ఈ స్థానంలో గుంటూరు జిల్లాలో ప్రొబెషనరీ డెప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పొందిన మొవిడి వాణీని నియమించారు. ఉయ్యూరు ఆర్డీవోగా ప్రస్తుతం పనిచేస్తున్న ఎన్‌ విజయకుమార్‌ను సాధారణ పరిపాలనశాఖకు బదిలీ చేశారు. ఈ స్థానంలో భీమవరం ఆర్డీవోగా పనిచేస్తున్న దాసి రాజును నియమించారు. కృష్ణాజిల్లాలో ప్రొబెషనరీ డెప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పొందిన కావూరి చైతన్యను చింతూరు ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

యార్డులో 27,401 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్‌ యార్డుకు గురువారం 26,510 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్‌ విధానం ద్వారా 27,401 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్‌ ఏసీ కామన్‌ రకం 334, నంబర్‌–5, 273, 341, 4884, సూపర్‌–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్‌ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్‌ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్‌ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది.

ముఖ్యమంత్రి పర్యటనపై ట్రయల్‌రన్‌

నేడు దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం వైఎస్‌ జగన్‌

వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి సన్నిధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు గురువారం ఆలయ ప్రాంగణంలో ట్రయల్‌రన్‌ నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం రోజున దుర్గమ్మకు రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను సమర్పించటం ఆనవాయితీగా వస్తోంది. ఆ క్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో శుక్రవారం మధ్యాహ్నం అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి పూజలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో భద్రత ఏర్పాట్లపై జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్‌, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించింది. ఆలయ పరిసర ప్రాంతాల్లో చేస్తున్న కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ట్రాఫిక్‌ నియంత్రణ చర్యలపై నగర పోలీస్‌ కమిషనర్‌ టి.కె. రాణా పరిశీలించి అనంతరం చేయాల్సిన ఏర్పాట్లను అధికారులకు వివరించారు. ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, భక్తులకు అసౌకర్యం ఏర్పడకుండా చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్‌ కలెక్టర్‌ సంపత్‌ కుమార్‌ వివిధ శాఖల అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది సమక్షంలో అడ్వాన్స్‌ సెక్యూరిటీ లైజన్‌ (ఏఎస్‌ఎల్‌) నిర్వహించారు. కాన్వాయ్‌ దిగువ నుంచి ఇంద్రకీలాద్రి పైకి సాఫీగా చేరుకునేలా ట్రయల్‌ రన్‌ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డెప్యూటీ పోలీస్‌ కమిషనర్‌ విశాల్‌ గున్ని, సబ్‌ కలెక్టర్‌ అదితి సింగ్‌, ఆలయ ఈవో కేఎస్‌ రామారావు పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ సంపత్‌కుమార్‌, డీసీపీ విశాల్‌గున్ని, ఇతర అధికారులు

జగనన్న పాలనలో పండుగలా వ్యవసాయం

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయం ఎప్పుడూ పండుగే అని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ సామినేని ఉదయభాను తెలిపారు. గురువారం అనిగండ్లపాడులో రూ.43.60 లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాలు, రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.11.15 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్‌ గోడౌన్‌, దాతల సాయంతో హిందూ శ్మశాన వాటికలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ ఇచ్చి రైతులను ఆదుకుంటే ఆయన కుమారుడు జగనన్న మరో రెండు అడుగులు ముందుకేసి వ్యవసాయాన్ని పండుగ చేసి రైతులకు భరోసా కల్పిస్తున్నారన్నారు. గతంలో రైతులు పంట నష్టపోతే దానిని లెక్కించటానికే ఎంతో కాలం పట్టేదన్నారు. బీమా కట్టడానికి కూడా రైతులు వెనుకాడేవారన్నారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో బీమా కూడా ప్రభుత్వమే చెల్లించటంతో పాటు పంట నష్టపోతే నష్టపరిహారం కూడా అదే సీజన్‌లో చెల్లిస్తోందన్నారు. ఇది దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. ఈ ప్రభుత్వంలో రైతు ఆత్మహత్యలు గానీ, నష్టపోయిన రైతులు గానీ లేరన్నారు. ఆర్‌బీకేలు, ప్రభుత్వ పాఠశాలలు పరిశీలించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి మంత్రులు, అధికారులు రావటం ఎంతో గర్వకారణమన్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో టీడీపీ నాయకులు అభివృద్ధి పనులు జరగకుండా కోర్టుల ద్వారా అడ్డుకోవటం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ బి. జ్యోతిబ్రహ్మం, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి, కేడీసీసీ బ్యాంక్‌ మాజీ చైర్మన్‌ తన్నీరు నాగేశ్వరరావు, మైనింగ్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ బత్తుల రామారావు, వైఎస్సార్‌ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, వైఎస్సార్‌ సీపీ మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, మండల పరిషత్‌ కో–ఆప్షన్‌ సభ్యుడు సయ్యద్‌ జాన్‌మియా, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, పెనుగంచిప్రోలు సర్పంచ్‌ వేల్పుల పద్మకుమారి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌ వేల్పుల రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రం వద్ద విప్‌ ఉదయభాను, కేడీసీసీ బ్యాంక్‌ చైర్‌పర్సన్‌ పద్మావతి తదితరులు

బీఎస్‌ఎన్‌ఎల్‌ ఉద్యోగుల రక్తదానం

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): రక్తదానం చేయటం సామాజిక బాధ్యత అని.. మనం చేసే రక్తదానం వల్ల మరో నలుగురి జీవితాలలో వెలుగు వస్తుందని బీఎస్‌ఎన్‌ఎల్‌ సీజీఎం ఎం. శేషాచలం అన్నారు. స్థానిక చుట్టుగుంట బీఎస్‌ఎన్‌ఎల్‌ భవన్‌లో గురువారం బీఎస్‌ఎన్‌ఎల్‌ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్‌ఎన్‌ఎల్‌ ఉద్యోగులు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించటంతో పాటు సామాజిక బాధ్యతగా రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవాకార్యక్రమాలలో తమ సిబ్బంది తమదైన పాత్ర పోషించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన స్వయంగా రక్తదానం చేయటంతో పాటు బీఎస్‌ఎన్‌ఎల్‌ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్‌ బ్యాంక్‌ వైద్యాధికారి డాక్టర్‌ రంజిత రక్తదానం చేయటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్‌ సీనియర్‌ జీఎం కేవీ సత్యప్రసాద్‌, జీఎం వై. రవీంద్రనాథ్‌, డీజీఎం పి.కోటేశ్వరరావు, జె.ఉమామహేశ్వరరావు బీఎస్‌ఎన్‌ఎల్‌ ఉద్యోగులు పాల్గొన్నారు.



బీఎస్‌ఎన్‌ఎల్‌ భవన్‌లో రక్తదానం చేస్తున్న సీజీఎం శేషాచలం, బీఎస్‌ఎన్‌ఎల్‌ ఉద్యోగులు

ఐదో రోజు దుర్గమ్మ ఆదాయం రూ.35.16 లక్షలు

వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.35,16,024 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎస్‌ రామారావు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. రూ.500 టికెట్ల ద్వారా రూ. 15 లక్షలు, రూ.300 టికెట్ల నుంచి రూ.4,35,000, రూ.100 టికెట్ల అమ్మకం ద్వారా రూ.3,70,000 ఆదాయం లభించింది. అలాగే కేశఖండన టికెట్ల ద్వారా రూ.66 వేల ఆదాయం లభించింది. 57 వేల లడ్డూ ప్రసాదం (రూ.15) టికెట్ల అమ్మకం ద్వారా రూ.8,55,000 ఆదాయం లభించింది. అలాగే వివిధ పూజలు తదితర రూపాల్లో మిగిలిన ఆదాయం లభించినట్లు వివరించారు.

బీసీల ఆత్మబంధువు సీఎం జగన్‌

రాష్ట్ర మంత్రి జోగి రమేష్‌



పెడన: బీసీలంటే బ్యాక్‌ వర్డ్‌ క్యాస్ట్‌ కాదని, సమాజానికి బ్యాక్‌ బోన్‌ క్లాస్‌ అని, నిండు మనసుతో నమ్మిన మన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దానిని మనసా వాచా కర్మేణా ఆచరిస్తూ ఆత్మబంధువుగా నిలిచారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ అన్నారు. గురువారం మంత్రి కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. చాలీచాలని ఆదాయంతో తమ జీవితాన్ని ఎంతో కష్టంగా కొనసాగిస్తున్న నిరుపేదలైన రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ల జీవితాల్లో మార్పు రావాలని, వారు ఇంకా ఆర్థికంగా ఎదగాలన్న సంకల్పంతో జగనన్న తోడు పథకాన్ని ప్రవేశపెట్టి వరుసగా నాలుగో ఏడాది పథకాన్ని అందజేశారని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో రూ.పది వేలు చొప్పున ముఖ్యమంత్రి జగన్‌ మోహన్‌ రెడ్డి బటన్‌ నొక్కి నేరుగా జమ చేశారని పేర్కొన్నారు. అర్హులై ఉండి పొరపాటున ఏ కారణం చేతనైనా ఈ లబ్ధి పొందని వారుంటే నేరుగా దగ్గరలోని సచివాలయంలో లేదా పెడన పట్టణంలోని మంత్రి కార్యాలయంలో గాని సంప్రదించాలని మంత్రి జోగి రమేష్‌ సూచించారు.

రక్తహీనత నివారణకు చర్యలు

కృష్ణా జిల్లా కలెక్టర్‌ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): పిల్లలు, గర్భిణుల్లో రక్తహీనతను నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా కలెక్టర్‌ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్‌ జవహర్‌రెడ్డి గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. కలెక్టర్‌ రాజాబాబు క్యాంపు కార్యాలయం నుంచి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సీఎస్‌ మాట్లాడుతూ ఆయా అంశాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు నిర్ణీత సమయంలో చేరుకునేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పాఠశాల విద్య, వైద్యం, ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, జగనన్నకు చెబుదాం, సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై సీఎస్‌ కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌ అనంతరం కలెక్టర్‌ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలు, గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. చిన్నపిల్లలు వారి వయసుకు తగ్గ బరువు, ఎత్తు కొలతలను కచ్చితంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త నమోదు చేసిన కొలతలను కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్‌ సచివాలయ మహిళా పోలీస్‌ ఇరువురి సమక్షంలో తిరిగి మరోమారు కొలతలను పరిశీలించాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల వద్దకు వచ్చే ప్రజల ఫోన్లలో ఆరోగ్యశ్రీ సిటిజన్‌ మొబైల్‌ యాప్‌ను లాగిన్‌ చేయాలని, ఈ ప్రక్రియ కోసం ప్రత్యేకమైన సమయం కేటాయించే అవసరం లేకుండా ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌ వైద్యాధికారులకు సూచించారు. డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీఈవో తాహెరా సుల్తానా, ఐసీడీఎస్‌ పీడీ ఎస్‌. సువర్ణ, సీపీవో కె. బదరీనారాయణ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్‌ రాజాబాబు, ఇతర అధికారులు

ఆర్చరీలో రైల్వే ఉద్యోగి సత్తా

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): గౌహతిలో ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరిగిన 13వ ఆలిండియా రైల్వే ఆర్చరీ చాంపియన్‌షిప్‌ పోటీలలో విజయవాడ డివిజన్‌ ఆఫీస్‌ సూపరింటెండెంట్‌ వై. చరణ్‌ రెడ్డి బంగారు పతకం సాధించారు. చరణ్‌రెడ్డి ఒలింపిక్‌ రౌండ్‌ వ్యక్తిగత విభాగంతో పాటు టీమ్‌ విభాగంలో సత్తాచాటి బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌ గురువారం డీఆర్‌ఓ కార్యాలయంలో చరణ్‌రెడ్డిని అభినందించారు. రైల్వే ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో చరణ్‌రెడ్డితో పాటు తమ డివిజన్‌కు చెందిన మరో ముగ్గురు పతకాలు సాధించటం అభినందనీయమన్నారు. సీనియర్‌ డీపీఓ ఎం. బాల మురళీధర్‌రావు పాల్గొన్నారు.



చరణ్‌రెడ్డిని అభినందిస్తున్న డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌

సహోద్యోగి సహృదయం

మృతుడి కుటుంబానికి నెల జీతం అందించిన హోంగార్డు

జగ్గయ్యపేట అర్బన్‌: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సహోద్యోగి కుటుంబానికి ఓ హోంగార్డు తన నెల జీతాన్ని సహాయంగా అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వత్సవాయి మండలం, మక్కపేటకు చెందిన హోంగార్డు గుడేటి కిశోర్‌బాబు నందిగామ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా 10 రోజుల క్రితం నందిగామ పోలీస్‌ స్టేషన్‌లో డ్యూటీ ముగించుకొని తన ఊరు మక్కపేటకు వస్తూ జాతీయ రహదారిపై పెనుగంచిప్రోలు మండలం, తోటచర్ల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో గురువారం మక్కపేటలో ఆయన ఆదరణ కూడిక(దినం) జరిగింది. కాగా జగ్గయ్యపేట పట్టణ సమీపంలో ఉన్న స్టీల్‌ప్లాంట్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న గజం నాగశివరామ్‌ మక్కపేటలో జరుగుతున్న కిశోర్‌బాబు ఆదరణ కూడికకు హాజరై తన వంతు సహాయంగా తన నెల జీతం రూ. 21,300ను కిశోర్‌బాబు కుటుంబ సభ్యులకు అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు.



కిశోర్‌బాబు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న హోంగార్డు నాగశివరామ్‌

ప్రధాన నిందితురాలు ఎక్కడ?

మణప్పురం బంగారం మాయం కేసులో దర్యాప్తు ముమ్మరం

కంకిపాడు(పెనమలూరు): మణప్పురం ఫైనాన్స్‌ సంస్థలో బంగారం చోరీ ఘటనపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. బంగారు ఆభరణాలను చోరీ చేసిన ప్రధాన నిందితురాలి కోసం గాలింపు చేపట్టారు. పట్టణంలోని మణప్పురం ఫైనాన్స్‌ సంస్థలో 10.660 కిలోల బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైన విషయం విదితమే. బ్రాంచ్‌ హెడ్‌గా పనిచేస్తున్న రెడ్డి వెంకట పావని ఈనెల 16వ తేదీ రాత్రి ఓ వ్యక్తితో కలిసి కారులో వెళ్లిన దృశ్యాలు సంస్థ కార్యాలయం కింద వైపున దుకాణాల వద్ద గల సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. మరుసటి రోజు నుంచి పావని విధులకు రాలేదు. ఖాతాదారులు తనఖా పెట్టిన 10.660 కిలోల బంగారు ఆభరణాలు కనిపించటం లేదని సంస్థ ఉన్నతాధికారులు పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సీసీ ఫుటేజ్‌ ఆధారంగా కారును గుర్తించి పావనితో కలిసి వెళ్లినట్లు భావిస్తున్న వ్యక్తిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఆ వ్యక్తిది కృత్తివెన్ను సమీపంలోని గ్రామం అని తెలుస్తోంది. కారు నంబర్‌ ఆధారంగా అడ్రస్‌ సేకరించి సంబంధిత వ్యక్తి వివరాలను పోలీసులు సేకరించి, విచారణ సాగిస్తున్నట్లు సమాచారం.

పావని కోసం విస్తృత గాలింపు..

ఘటన నేపథ్యంలో బ్రాంచ్‌ హెడ్‌ పావని పరారీలో ఉన్నారు. ఆమె కోసం ఆరు ప్రత్యేక పోలీసు బృందాలను జిల్లా పోలీసు శాఖ రంగంలోకి దించింది. సెల్‌ ఫోన్‌ లొకేషన్స్‌, సీసీ ఫుటేజ్‌, ఆమె బంధువుల వివరాలు సేకరణ ద్వారా పావనిని అదుపులోకి తీసుకునే పనిలో పడ్డారు. ఇదిలా ఉంటే సంస్థ కార్యాలయంలో సీసీ కెమెరాలు నెల రోజులకు పైగా పనిచేయకపోయినా అధికారులు పట్టించుకోకపోవటం పట్ల ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది. తనఖా పెట్టిన వస్తువులకు భద్రత ఏమిటని ప్రశ్నిస్తున్నారు.



మణప్పురం సంస్థ కార్యాలయంలో వివరాలను సేకరిస్తున్న ఎస్‌ఐ కె.సుధాకర్‌ (ఫైల్‌)

వ్యభిచార గృహంపై దాడి.. ఇద్దరు అరెస్ట్‌

పెనమలూరు: వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి రామాపురం కాలనీ వద్ద వ్యభిచార గృహం నిర్వహిస్తున్న కుందుల లక్ష్మి, తాడిగడప శ్రీనివాసానగర్‌లో షేక్‌ రజియాబేగం గృహాలపై పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను అరెస్టు చేశారు. వ్యభిచార గృహంలో ఉన్న ఇద్దరు మహిళలను విజయవాడ పునరావాస గృహానికి తరలించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌ విధించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మైలవరం: స్థానిక విజయవాడ రోడ్డులోని లారీ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి జరిగింది. మృతుడు షేక్‌ రహీం(40) స్థానిక చంద్రబాబునగర్‌ నివాసి. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రహీం గతంలో కె. రాజు అనే లారీ ఓనర్‌ వద్ద క్లీనర్‌గా పని చేసేవాడు. ఆ సమయంలో ఓనర్‌ రాజుకు బాకీ పడ్డాడు. ఆ బాకీ తీర్చేందుకు కె. గణేష్‌ అనే లారీ ఓనర్‌ వద్ద పనిచేస్తానని చెప్పి రూ.50వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. అయితే గణేష్‌ వద్ద పనిచేయకుండా మళ్లీ రాజు వద్దనే పనిచేస్తుండటంతో గణేష్‌ తన వద్ద తీసుకున్న అడ్వాన్స్‌ తిరిగి చెల్లించమని ఒత్తిడి తీసుకువచ్చాడు. అతను చెల్లించకపోవడంతో గణేష్‌ లారీ క్లీనర్‌ రహీంను తీసుకువచ్చి బుధవారం రాత్రి లారీ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో ఉంచి తన బాకీ చెల్లిస్తేనే వదులుతానని చెప్పి గదికి బయట తాళం వేసి వెళ్లిపోయాడు. దీనితో మనస్తాపానికి గురైన రహీం ఫ్యాన్‌ రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.



లారీ క్లీనర్‌ రహీం మృతదేహం

టైరు పేలి కారు బోల్తా

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): కారు టైరు పేలి బోల్తా పడిన సంఘటన గ్రామంలోని 65వ నంబర్‌ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. హైదరాబాద్‌ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు గ్రామం వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా టైర్‌ పేలింది. దీంతో రోడ్డుపై మూడు పల్టీలు కొట్టింది. అంతేకాకుండా ఎదురుగా వెళ్తున్న లారీని కూడా ఢీకొట్టంతో కారు పూర్తిగా ధ్వంసం అయ్యింది. అయితే కారులో ఎయిర్‌ బెలూన్స్‌ ఓపెన్‌ అవ్వటంతో కారులో ఉన్న దంపతులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు.



బీసీ సంక్షేమ సంఘం నేతల హర్షం

మచిలీపట్నంటౌన్‌: బీసీలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న కులగణనకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి సానుకూలంగా స్పందించడంపై సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి సంఘం తరపున సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని సంఘ కార్యాలయంలో గురువారం శేకుబోయిన మాట్లాడారు. సీఎం జగన్‌ బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు పలు అంశాల్లో అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. బీసీల అభ్యున్నతే ధ్యేయంగా చట్ట సభల్లో 65 శాతానికి పైగా వాటా ఇచ్చారన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారని చెప్పారు. కులగణన ఆధారంగా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్‌ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్‌. కృష్ణయ్యతో కలిసి తాము ఉద్యమించామన్నారు. బీసీల శత వసంతాల కులగణన కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రికి బీసీ సంక్షేమ సంఘం నాయకులంతా కృతజ్ఞతలు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నిక్కు రాధాకృష్ణ, ఎల్‌ఐసీ రాంబాబు, చేబోయిన కోటేశ్వరరావు, పామర్తి బాల, ఎం. పవన్‌ తదితరులు పాల్గొన్నారు.

